క్లుప్తంగా

హాస్యనటుడు రాజబాబుకు నివాళి



రాజబాబు వర్ధంతిలో పాల్గొన్న బాబీ, మిత్రబృందం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): హాస్య నటుడు రాజబాబు 40వ వర్ధంతి సందర్భంగా మంగళవారం గోదావరి గట్టున ఉన్న కాంస్య విగ్రహానికి ఆయన తమ్ముడు బాబీ ఆధ్వర్యాన పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ రాజబాబు మన నుంచి దూరమై 40 ఏళ్లు అవుతున్నా, ఆయన జ్ఞాపకాలు అందరి మదిలో ఉన్నాయన్నారు. మిత్రబృందం ముసిని వెంకటేశ్వరరావు(బాబులు), మల్లు శ్రీను, కాశీ, బాబీ, మల్లు కిరణ్, గోబేరు గణేష్, కట్టా చంద్రరావు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాజానగరం ఎంపీడీవో కార్యాలయంలోని కామన్ ప్రొడక్షన్ సెంటర్‌లో నిరుద్యోగ యువకులకు ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొల్యూషన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం.కొండలరావు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. 8వ తరగతి, ఆపై విద్యార్హత కలిగిన వారు అర్హులని, మరిన్ని వివరాలకు 83285 07473 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీలో నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి రూ.లక్ష విరాళం అందించారు. మంగళవారం ఆయన నివాసంలో నిర్వాహకులకు ఈ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో శాటిలైట్ సిటీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దార అన్నవరం, ప్రధాన కార్యదర్శి ఎమ్మెస్సార్ శీను, గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు కసినాడ నాగబాబు పాల్గొన్నారు.

సత్యదేవ నర్సరీ సందర్శన



తక్కరేకు స్వాగతం పలుకుతున్న పుల్లా ఆంజనేయులు తదితరులు

కడియం: కడియపులంకలోని సత్యదేవ నర్సరీని రాయఘడ ఎంపీ, లోక్‌సభ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ తక్కరే మంగళవారం సందర్శించారు. ఆయనకు నర్సరీ రైతులు పుల్లా ఆంజనేయులు చైనా ఆరెంజ్ డ్వార్ఫ్ వెరైటీ మొక్కను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. నర్సరీలోని వివిధ రకాల మొక్కలను గురించి ఆయనకు రైతులు పుల్లా వీరబాబు, రాజశేఖర్ వివరించారు. తక్కరే మాట్లాడుతూ ప్రత్యేక రకాలను అభివృద్ధి చేస్తున్న కడియం ప్రాంత నర్సరీ రైతాంగం నైపుణ్యం అద్భుతమన్నారు. కార్యక్రమంలో సంతోష్ చింతలే, అనిల్ అంబేడ్కర్, గణేష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

అమర జవాన్లకు నివాళి

ప్రకాశం నగర్: పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పుల్వామా దాడిలో అమరులైన జవానులకు మంగళవారం నివాళులర్పించారు. లాలాచెరువులోని జవాన్ విగ్రహానికి పూలమాలలు వేశారు. సంఘం అధ్యక్షుడు లంక సత్యనారాయణ మాట్లాడుతూ సైనికుల త్యాగాలు మరువలేనివన్నారు.

కరాటే విజేతలకు అభినందనలు

ప్రకాశం నగర్: హైదరాబాద్‌లో జరిగిన మూడో నేషనల్ ఓపెన్ కరాటే అండ్ కరాటే సీఎం కప్పు 2023లో రాజమహేంద్రవరం విద్యార్థులు ప్రతిభ చూపారు. పలువురు బంగారు, వెండి పతకాలు సాధించారు. విజేతలను మంగళవారం సౌత్ జోన్ డీఎస్పీ ఎం.శ్రీలత, సావాడ శ్రీనివాస్ రెడ్డి, సీహెచ్.గంగాధర్ చౌదరి, కె.చిన్నిబాబు, సునీల్, విశాలాక్షి, మాస్టర్ పిల్లి అరుణ్ కుమార్ అభినందించారు.

లీజ్‌కు ఆర్టీసీ స్థలాలు

రాజమహేంద్రవరం సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఆర్టీసీ ఆధీనంలో ఉన్న ఖాళీ స్థలాలను వ్యాపారాభివృద్ధి కోసం ఔత్సాహిక వ్యాపారులకు లీజ్‌కు ఇస్తామని డీపీటీఓలు షర్మిల అశోక, ఆర్‌వీఎస్ నాగేశ్వరరావు, శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోని ట్రైనింగ్ సెంటర్‌లో ఔత్సాహిక వ్యాపార వేత్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి పలు ప్రాంతాల నుంచి సుమారు 30 మంది వ్యాపారులు తరలి వచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

మితిమీరిన వేగం.. భారీమూల్యం

- బైక్‌లపై దూసుకుపోతున్న మైనర్లు
- పలుచోట్ల ప్రమాదాలు
- చర్యలు తప్పవంటున్న పోలీసులు



ద్విచక్ర వాహనం నడిపితే వచ్చే అనర్థాలపై మైనర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కంబాలచెరువు: తెలిసీ తెలియని వయసు, ఉరకలు వేస్తూ ఉత్సాహంగా వేగంగా దూసుకుపోవాలనే ఆరాటం, ముందు వస్తున్న ప్రమాదాన్ని పసిగట్టలేని జ్ఞానం.. వెరసి కుటుంబాల్లో తీవ్ర శోకం. మైనర్లు ద్విచక్ర వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు గురై తల్లిదండ్రులను క్షోభకు గురిస్తున్నారు. ఇటీవల కాలంలో ఎక్కువగా జరుగుతున్న సంఘటనలు ఇవి. 18 ఏళ్లు నిండకుండా వాహనం నడపడం చట్టరీత్యా నేరం. అయితే మైనర్లపై కేసులు నమోదు చేయడానికి వీలు లేదు. దీంతో పోలీసులు వారిని రోడ్లపై వాహనంతో పట్టుకున్నా ఏమీ చేయలేని పరిస్థితి.

పలు సంఘటనలు

ఇటీవల మైనర్లు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్న సంఘటనలు రాజమహేంద్రవరం పరిధిలో చోటుచేసుకుంటున్నాయి. ఏవీఆర్ రోడ్డు, మెరంపూడి జంక్షన్, వీఎల్.పురం, లాలాచెరువు, కంబాలచెరువు, గోదావరి బండ్, వేమగిరి జంక్షన్లు నిత్యం రద్దీతో ప్రమాదకరంగా ఉంటాయి. వాహనాలను నడపడంలో అనుభవం ఉన్న పెద్దలు సైతం ఈ ప్రాంతాల్లో చాలా అప్రమత్తంగా వెళతారు. మిడిమిడి జ్ఞానం, వేగం అదుపుతప్పితే ఏం జరుగుతుందో తెలీని మైనర్లు ద్విచక్ర వాహనాల్ని రయ్ మంటూ పోనిచ్చి ప్రమాదాల పాలవుతున్న సంఘటనలు అనేకం చోటుచేసుకుంటున్నాయి. వీటిలో కొందరు చిన్నపాటి గాయాలతో బయటపడుతుంటే, ఇంకొందరు శాశ్వత మంచాన బారిన పడుతుండగా, కొందరు మృత్యువాత పడుతున్నారు.

తల్లిదండ్రులపై కేసులు

ఇటీవల లాలాచెరువు, మోరంపూడి హైవేపై జరిగిన ప్రమాదంలో ఇద్దరు మైనర్లు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మైనర్లు వాహనం నడిపితే తీసుకోవాల్సిన చర్యలపై ఇన్‌చార్జి ఎస్పీ సుధీర్‌కుమార్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. వెంటనే ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లు వాహనం నడిపతే జరిగే ప్రమాదాలను వారికి వివరిస్తున్నారు. మొన్నటి వరకు మైనర్లు వాహనం నడిపితే వారిని పట్టుకున్న పోలీసులు చిన్నపాటి జరిమానాలతో వదిలేసేవారు. అయితే మైనర్ల వాహనం నడిపే తీరు..జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో మైనర్లు వాహనం నడుపుతూ దొరికితే కఠిన చర్యలు చేపడుతున్నారు.

వాహనం ఇచ్చిన వారిపై కేసు



మైనర్లు వాహనం నడపడం, వారికి ఇవ్వడం నేరం. మైనర్లు వాహనం నడిపితే ముందుగా తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తాం. వారికి వాహనం ఇచ్చిన వ్యక్తి, ఆ వాహన యజమానిపై చర్యలు చేపడతాం. చిన్న పిల్లలకు వాహనాలు ఇచ్చి తల్లిదండ్రులు ఇబ్బందులు తెచ్చుకోవద్దు. పోలీసులు తీసుకునే చర్యలకు బాధ్యులు కావద్దు. చిన్న పిల్లలు వాహనాలు నడిపుతూ కనిపిస్తుంటే వెంటనే వారికి దాని వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం. కేసులు నమోదు చేస్తున్నాం.

– టి.గణేష్, రెండో పట్టణ సీఐ, రాజమహేంద్రవరం

నేడు విద్యుత్ అంతరాయం

ధవళేశ్వరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ధవళేశ్వరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ధవళేశ్వరం, ఇండస్ట్రియల్ కాలనీ, ఎర్రకొండ, ఇనోసాల్ట్ ఏరియా, రత్నా ట్యూబ్స్, మంతెన ఆశ్రమం, బత్తిన సుబ్బారావు కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆంజనేయస్వామి దీక్ష

కడియం: కడియపులంక పాత పువ్వుల మార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం 158 మంది భక్తులు ఆంజనేయ మాలలు ధరించి, దీక్షలు చేపట్టారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవాన్ని ఏటా వైభవంగా జరుపుతారు. అలాగే భారీ అన్నదానం నిర్వహించారు. ఈ యేడాది 73వ వార్షికోత్సవం సందర్భంగా భక్తులు ఆంజనేయ మాలలు ధరించారు. తొమ్మిది రోజుల పాటు దీక్ష చేసే ఈ స్వాములకు నిత్య పూజలు తదితర సదుపాయాలను ఆలయ కమిటీ సమకూర్చనుంది.

యువతి అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: కిరాణా సరుకులు తీసుకువస్తానని ఇంటి నుంచి వెళ్లిన తన కుమార్తె తిరిగి రాలేదని దివాన్ చెరువుకు చెందిన మేడా సాయిదుర్గాభవాని మంగళవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. 23 ఏళ్ల మేడా సాయిదుర్గాభవాని లాకోర్సు చదువుతుంది. ఈనెల 9వతేదీ సాయంత్రం కిరణా సామాన్లు తీసుకువస్తానని వెళ్లి తిరిగిరాలేదు. ఈ మేరకు ఎస్సై జగన్‌మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మృతి కేసులో ఐదేళ్ల జైలు

ధవళేశ్వరం: మహిళ మృతికి కారణమైన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి వేల్పుల భవానీ తీర్పు ఇచ్చారని సీఐ మంగాదేవి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. 2016 ఏప్రిల్ 4వ తేదీన ధవళేశ్వరానికి చెందిన చొల్లంగి జయలక్ష్మి ఉరి వేసుకుని మృతి చెందింది. ఆమె భర్త శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై బి.నరసింహమూర్తి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. జయలక్ష్మి మృతికి కారణమైన పులగుర్తకు చెందిన గుబ్బల నాగ సత్యనారాయణ (సత్తిబాబు)ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోడి సతీష్ నాయుడు వాదనలు వినిపించారు. అనంతరం గుబ్బల నాగ సత్యనారాయణకు ఐదేళ్ల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు. కేసులో సాక్షులను ప్రవేశపెట్టి నిందితుడికి శిక్ష పడేలా చేసిన కోర్టు కానిస్టేబుళ్ల ప్రసాద్, రమేష్‌ను డీఎస్పీ ఎం.శ్రీలత, సీఐ మంగాదేవి అభినందించారు.

ఎంపీ భరత్‌రామ్‌కు సత్కారం



ఎంపీ భరత్‌రామ్‌ను సత్కరిస్తున్న శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: తమ సంఘీయులను గుర్తించి సముచిత స్థానం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఘనంగా సత్కరించింది. వీఎల్‌పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో మంగళవారం ఆ సంఘ పెద్దలు ఎంపీ భరత్‌రామ్‌ను కలిశారు. అన్నవరం దేవస్థాన ట్రస్టు బోర్డులో ఇప్పటి వరకూ యాదవులకు ఏ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్థానం కల్పించలేదన్నారు. ఇప్పుడు ట్రస్టుబోర్డు సభ్యుడిగా తమ సంఘ సభ్యుడైన కడియాల లక్ష్మణరావును నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నక్కళ్ల బాబూరావు, పడగల ప్రసాద్ యాదవ్, తురాల శ్రీనివాస్ యాదవ్, కడియాల సత్యనారాయణ రాజు, బూరే స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి ఇళ్ల స్థలాల పంపిణీ

- కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- వేమగిరి లేఅవుట్ పరిశీలన

కడియం: మండలంలోని వేమగిరి – 3 జగనన్న లేఅవుట్‌లో ఉగాదికి 850 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. ఆ లేఅవుట్‌ను మంగళవారం పార్టీ నాయకులు, అధికారులతో కలిసి చందన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులను వేగవంతం చేయాలని, నాణ్యతలో రాజీ పడితే సహించేది లేదని హెచ్చరించారు. లేఅవుట్ చదును చేసిన కాంట్రాక్టర్ తప్పిదం కారణంగా లబ్ధిదారులకు స్థలాల పంపిణీ ఆలస్యమైందన్నారు. జిల్లా కలెక్టర్ మాధవీలత స్వయంగా పనులను పర్యవేక్షిస్తున్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించే బాధ్యత తీసుకోవాలని స్థానిక నాయకులు వెలుగుబంటి వెంకటాచలానికి సూచించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బత్తుల రాము, బడుగు ప్రశాంతకుమార్, సూరపరెడ్డి జానకిరామ్, యడ్ల రాజా రమేష్, కుమార్, కట్టా జమీందార్, బైవరపు నాగేశ్వరరావు, శీలి జాన్, నల్లా ప్రసన్నకుమార్, తహసీల్దార్ ఎం.సుజాత, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.



వేమగిరి లేఅవుట్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

ఆర్టీసీ గ్యారేజీలో వైద్య శిబిరం

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరం ఆర్టీసీ గ్యారేజీలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు వేద స్పైన్ వైద్యుడు తేజో ఫణీంద్ర వైద్యసేవలందించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేసే ఎక్కువ మందికి నడుము, వెన్నుముక, కీళ్లనొప్పులు వస్తుంటాయని, వ్యాయామం, వాకింగ్ చేయడం ద్వారా ఆ బాధల నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. కార్యకమంలో డిపో మేనేజర్ షేక్ షబ్నమ్, అసిస్టెంట్ ఇంజినీర్ ఈశ్వరరావు, సూపర్‌వైజర్ పీఎస్ రాజు పాల్గొన్నారు.

నేడు సమన్వయ సమావేశం

మధురపూడి: కోరుకొండలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవాల నిర్వహణ కోసం బుధవారం సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నట్టు అన్నవరం ట్రస్టుబోర్డు సభ్యులు తాడి రజనీరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. నరసన్న కల్యాణోత్సవాలు మార్చి 2 నుంచి 8 వరకు జరుగుతాయన్నారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు.

బహిరంగ వేలం

తీర్థంలో కొబ్బరి ముక్కలు తీసుకోవడానికి, తలనీలాలు పోగుచేసుకోవడానికి, భక్తుల జోళ్లు భద్రపరిచే జోళ్లస్టాండ్ లైసెన్స్ తదితర వాటికోసం బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

రాజమహేంద్రవరం సిటీ: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఆర్‌ఓ జి.నరసింహులు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం డీఆర్‌ఓ చాంబర్‌లో సమన్వయశాఖలతో సమీక్షించారు. ఈనెల 20 నుంచి మార్చి 7 వరకూ ప్రాక్టికల్స్, మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 వరకూ థియరీ పరీక్షలు జరుగుతాయన్నారు. ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు జిల్లాలో 32 సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పరీక్షలు ఫిబ్రవరి 20 సోమవారం నుంచి మార్చి 7 వరకు జరుగుతాయన్నారు. ఇంటర్ జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 26 నుంచి మార్చి 7 వరకూ, అకడమిక్ థియరీ పరీక్షలు మార్చి 23 నుంచి ఏప్రిల్ 4 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఓ నరసింహులు

జిల్లాలోని 72 కేంద్రాల్లో 26,931 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, కంట్రోల్ రూమ్‌ను 0883 2473430 ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి హీరో జూమ్ స్కూటర్

రాజమహేంద్రవరం సిటీ: హీరో మోటోకార్ప్ స్కూటర్ కేటగిరీ ద్వారా హైటెక్ 110 సీసీ స్కూటర్ జూమ్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. మెయిన్‌రోడ్డులోని సీపీ రెడ్డి మోటార్స్‌లో హీరో జూమ్ స్కూటర్‌ను మంగళవారం రోటరీ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్, ప్రముఖ ఆడిటర్ వి.భాస్కరరామ్ ఆవిష్కరించి, టెస్ట్ డ్రైవ్ చేశారు. ఈ సందర్భంగా సీపీ రెడ్డి మోటార్స్ అధినేత సీహెచ్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ హీరో ఇంటిలిజెంట్ కార్నరింగ్ లైట్ (హెచ్ఐసీఎల్), పెద్ద టైర్లు, జీపీ యాక్సిలరేషన్ తదితర ఫీచర్లు ఉన్నాయన్నారు. శక్తివంతమైన బీఎస్‌సీ 6 ఇంజిన్‌తో వస్తుందన్నారు. షీడ్ డ్రమ్, కాస్ట్ డ్రమ్, కాస్ట్ డిస్క్ అనే మూడు వేరియంట్లలో లభ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జీఎస్ చక్రవర్తి, స్వర్ణాంధ్ర నిర్వాహకులు లయన్ గుబ్బల రాంబాబు, రోటేరియన్లు ఆర్‌వీ ప్రసాదరావు, ఏఆర్‌కే రావు పాల్గొన్నారు.



స్కూటర్‌ను విడుదల చేస్తున్న భాస్కరరామ్

నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి

- సీ, డీ గ్రేడ్ విద్యార్థుల చదువుపై ప్రత్యేక కార్యాచరణ
- కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ: విద్యావిధానంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి బోధన, బోధనేతర అంశాలపై మండల విద్యాశాఖాధికారులు, డీఆర్డీఏ సహాయ ప్రాజెక్ట్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖాధికారులు, ఏపీఎంలతో డ్రాప్ అవుట్స్, నాడు – నేడు పనులు, మిడ్డే మీల్స్ (జగనన్న గోరుముద్ద), ట్యాబ్‌ల వినియోగం, పదో తరగతి ఫలితాలపై కలెక్టర్ సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో 675 స్కూళ్లలో నాడు – నేడు పనులు చేపడుతుండగా, వాటిలో 50 స్కూళ్లలో రూ.20 వేల నుంచి రూ.లక్ష పైబడిన పెండింగ్ పనులను పూర్తి చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నిధులు కేటాయించినా ఆయా పనులు పూర్తి చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న గోరుముద్ద పథకం కింద పౌష్టికాహారం అందించడం జరుగుతోందని, నూటికి 95 శాతం మంది ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. ఆ పథకానికి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత

అందజేసే కోడిగుడ్లకు ప్రతివారం ఒక రంగు ఇస్తున్నామన్నారు. నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా కోరుకొండ మండలం కాపవరం, కోరుకొండలో కేంద్రాలు నిర్వహిస్తున్నామని, రాజమహేంద్రవరంలోని మరో ఐదు స్కూళ్లలో ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ తెలిపారు.

1,399 మంది బడిబయట పిల్లలు

జిల్లాలో 1,399 మంది బడిబయట పిల్లలను గుర్తించి, వారిలో 315 మందిని తిరిగి స్కూళ్లలో జాయిన్ చేసినట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. బడి బయట పిల్లల బాధ్యత పూర్తిగా ఎంఈఓలదేనని అన్నారు. పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు వచ్చేలా స్కూళ్ల తనిఖీ సమయంలో విద్యార్థుల్లోని విద్యా ప్రమాణాలను పరిశీలన చేయాలన్నారు. ఈ దిశలో మండల విద్యాధికారులు, ఏపీఎంలు వ్యక్తిగత శ్రద్ధ, పర్యవేక్షణ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. జిల్లాలో 16,024 మంది విద్యార్థులు, 1,802 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు పంపిణీ చేసినట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, డీఆర్‌డీఏ పీడీ ఎస్.సుభాషిణి, పశుసంవర్ధక జేడీ ఎస్‌జీటీ. సత్యగోవింద్, జిల్లా మత్స్యఅధికారి కేవీ కృష్ణారావు పాల్గొన్నారు.

వ్యవసాయంపై కేంద్రానికి చిన్నచూపు

ప్రకాశం నగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023 బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు తక్కువ కేటాయించి, చిన్నచూపు చూశారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం, అదానీస్కాం కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం వంటి అంశాలపై మంగళవారం ఉదయం స్థానిక సీపీఐ కార్యాలయంలో చిట్టూరి ప్రభాకర్ చౌదరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముందుగా ప్రభాకర్ చౌదరి చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ రైతులకు ఇచ్చే సబ్సిడీ తగ్గించారని, దీంతో వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలో వెళ్తుందన్నారు. సమావేశానికి పార్టీ సీనియర్ నాయకుడు చెలికాని స్టాలిన్ అధ్యక్షత వహించారు. సీపీ ఫౌండేషన్ అధ్యక్షుడు తాటిపాక మధు, కార్యదర్శి కుంద్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

ప్రణాళిక ప్రకారం చదివితే అద్భుత విజయాలు

- డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామసుబ్రహ్మణ్యం

రంగంపేట: విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివితే అద్భుత విజయాలు సాధించొచ్చని బొమ్మూరు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ నూజిళ్ల రామసుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం వి.పార్థసారథి అధ్యక్షతన జరిగిన పరీక్షా పర్వ అంశంపై జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పరీక్షలు పూర్తయ్యేవరకూ టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. తక్కువ మార్కులు వచ్చే సబ్జెక్టులపై అవగాహన పెంచుకుని ఎక్కువ మార్కులు సాధించడానికి కృషి చేయాలన్నారు. ఎస్‌పీసీఆర్ సౌజన్యంతో జిల్లావ్యాప్తంగా 10 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా చెప్పారు. అనంతరం ఆయన విద్యార్థులకు పెన్నులు బహూకరించి పరీక్షల్లో విజేతలు కావాలని ఆశీర్వదించారు. సమావేశంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు పి.చంద్రశేఖర్, వీసీ జాకబ్, ఎన్. వెంకటలక్ష్మి, సీఆర్పీ రాజు తదితరులు పాల్గొన్నారు.



రంగంపేట హైస్కూల్లో విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రిన్సిపాల్ రామసుబ్రహ్మణ్యం

ఆదర్శప్రాయుడు సంజీవయ్య

కడియం: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఆదర్శప్రాయుడని సేవాస్తంబ్ జిల్లా అధ్యక్షుడు గండి స్వామిప్రసాద్ అన్నారు. జేగురుపాడులోని సంస్థ కార్యాలయంలో మంగళవారం సంజీవయ్య జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. స్వామిప్రసాద్ మాట్లాడుతూ కార్మికులకు బోనస్, ఆరులక్షల ఎకరాల బంజరు భూముల పంపిణీ, భూగర్భగనుల శాఖ, అవినీతి నిరోధక శాఖ, లలిత కళల అకాడమీ ఏర్పాటు వంటివి సంజీవయ్య దార్శనికతకు నిదర్శనమన్నారు.



సంజీవయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సభ్యులు

రేపటి నుంచి కల్యాణోత్సవాలు

మధురపూడి: కోరుకొండ మండలం కణుపూరు కొండపైన కొలువైన భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 18 నుంచి 22 వరకూ నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.